క్లుప్తంగా

ఘనంగా అన్నసమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

డాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గ పరిధి టౌన్‌కొత్తరోడ్డు సమీపాన వెలసిన జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఆలయ ఈవో టి. రాజ్‌గోపాల్‌రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మారోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొని అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామికి సేవలందించిన పలువురికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి ఆలయ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, జగన్నాథస్వామి ఆలయ ధర్మకర్తలు కొండా జ్యోతి, వాకాడ రాధ, కంచర్ల రవి, కంటుముచ్చు సాగర్, కంచుబోయిన ఉదయ బస్వంతి, ధనాల రాంబాబు, సూరిని రాము, శీల శివప్రసాద్, పార్టీ నాయకులు, ధర్మకర్తల మండలి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు

బహిరంగ వేలం వాయిదా

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 5వ జోన్ పరిధి జ్ఞానాపురం కార్యాలయంలో ఈ నెల 14న కాన్వెంట్ జంక్షన్ వద్ద గల ఐవోసీఎల్ పెట్రోల్ బంక్ స్థలం వేలం నిర్వహించాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ వేలం ఎప్పుడు నిర్వహించేది త్వరలో పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తామని, పూర్తి సమాచారం కోసం జోన్-5 జోనల్ కార్యాలయ పర్యవేక్షకులను పని వేళల్లో సంప్రదించాలని తెలిపారు.

జగనన్న సురక్షతో మేలైన సేవలు

- అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం
- కార్యాలయాల చుట్టూ తిరగకుండానే కోరిన పత్రాల అందజేత
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూల్ ఆవరణలో 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపికృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. అదే విధంగా 31వ వార్డు ద్వారకాబజార్‌లో కార్పొరేటర్ బిపిన్ జైన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ప్రత్యేక క్యాంపుల్లో ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండా అర్హులకు కావలసిన పత్రాలు అందజేస్తారన్నారు. ఈ క్యాంపుల ద్వారా కుల, నివాస, ధ్రువీకరణ సర్టిఫికెట్లతో పాటు ఆదాయ ధ్రువీకరణ, బర్త్, డెత్ సర్టిఫికెట్లు, మ్యారేజీ, ఫ్యామిలీ తదితర 11 రకాల సర్టిఫికెట్లు ఈ క్యాంపుల్లో ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల వెనుక తిరిగి తిరిగి వారికి లంచాలు ఇచ్చి కూడా పింఛన్ మంజూరు చేయించుకోవాలంటే తిప్పలు పడేవారన్నారు. జగనన్న సురక్ష పథకం ద్వారా ఉచితంగా పింఛన్, రేషన్ కార్డులు వంటి సేవలు సులువుగా లభిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు గుర్తించిన లబ్ధిదారులకు కుల, ఆదాయం, పింఛన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌వో ఆనంద్‌కుమార్, జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ శివప్రసాద్, అధికారులు డీఈ వెంకటేశ్వరరావు, ఈఈ రమణమూర్తి, జేసీజే ఇన్‌చార్జిలు కర్రి నీలకంఠం, దొడ్డి రామానంద్, కన్వీనర్లు బొడ్డేటి ప్రసాద్, బాపు ఆనంద్, ఎం.రమేష్, వై.చిన్నమ్మలు, ఊర్వశి, బ్రహ్మాజీ, శ్రీను, బొర్రా విజయలక్ష్మి, బొర్రా శ్రీనివాసరెడ్డి, కణితి బ్రహ్మం, కొల్లి సత్యవతి, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు

వలంటీర్ల సేవలు మరువలేనివి

- ఆత్మబంధువుల్లా ఆదుకుంటున్నారు
- కొనియాడుతున్న లబ్ధిదారులు

జగదాంబ : రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ సేవకు మారుపేరుగా నిలిచింది. అర్హులందరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకు నియమించిన వలంటీర్లు ప్రతీ ఇంటికి ఆత్మీయ బంధువై, ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. కరోనా విపత్తు వేళ గడప దాటి బయటకు రాలేని విపత్కర పరిస్థితుల్లో వారు అందించిన సేవలకు ఎన్నో ప్రశంసలు దక్కాయి. కరోనా రోగులకు మందులు, పౌష్టికాహారం అందించి ఎంతోమంది ప్రాణాలు నిలిపారు.

తలుపు తట్టి పింఛన్ అందిస్తూ..

లబ్ధిదారుల ఇంటికే వెళ్లి ఠంచన్‌గా పింఛన్ అందించడంతో పాటు ప్రతీ కుటుంబానికి ఏయే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయో తెలియజేస్తూ వారితో దరఖాస్తు చేయించి, నేరుగా పథకాల లబ్ధిని అందేలా సహకరిస్తున్నారు. కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్, మ్యారేజ్ తదితర సర్టిఫికెట్లను ఇంటికే తీసుకువెళ్లి అందించడంతో దరఖాస్తుదారులు వారి సేవలను కొనియాడుతున్నారు. అర్హులందరినీ బీమా పథకంలో చేర్పించడం, రేషన్ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియజేయడం.. ఇలా అన్ని విధాలుగా సహకారం అందిస్తుండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగన్‌బాబు ఇంటికే పింఛన్ పంపిస్తున్నారు



జగన్‌బాబు ఇంటికే పింఛన్ పంపిస్తున్నారు. నడవలేక ఇంటికే పరిమితమైన మాకు ఇంటికైతే ఇంటికి.. ఆసుపత్రికి అయితే ఆసుపత్రికి వచ్చి అందజేస్తున్నారు. ఆ పుణ్యమంతా మా వలంటీర్లదే. ప్రభుత్వం అంటే అలా ఉండాలి.. సేవ అంటే వలంటీర్లు చేస్తున్నట్లు ఉండాలి.

–షేక్ ఇస్మాయిల్, గాజులవీధి, 35వ వార్డు.

సేవలంటే.. వలంటీర్లవే



ఒకప్పుడు పెన్షన్ అందుకోవాలంటే నానా యాతన పడేవాళ్లం. అయినప్పటికీ ఇస్తారా అంటే ఇచ్చేవారు కాదు. తిప్పించుకునే వారు. ఇప్పుడు ఒకటో తేదీ వస్తే ముందు ఇంటికి వచ్చేది వలంటీర్లే.. తంబ్ వేసుకుని పెన్షన్లు అందజేస్తున్నారు. గడప దాటకుండా పింఛన్ అందుకుంటున్నాం. వలంటీర్ల సేవలు వెలకట్టలేం. సేవలంటే వలంటీర్లవే. అటువంటి వారిని నిందించడం తగదు.

–వరలక్ష్మి, కల్లుపాకలు, 35వ వార్డు

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో ఆరుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో 44 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు ధనలత, అనురాధ, సతీష్, సురేష్, సుబ్రహ్మణ్యం, సత్య రూపవాణి, మారుతీప్రసాద్, వెంకట రామకృష్ణ, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

సైన్స్‌తోనే సమాజ ప్రగతి



సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు జగదీష్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

డాబాగార్డెన్స్ : సైన్స్ ద్వారానే సమాజ ప్రగతి సాధ్యమని, సమాజాన్ని సైన్స్ ఎంతగానో దోహదం చేస్తుందని సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు సీహెచ్ జగదీష్ పేర్కొన్నారు. స్టోరీ ఆఫ్ ఎవ్రిథింగ్ అనే కార్యక్రమాన్ని గురువారం నగరంలోని ఏవీఎన్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రీయ దృక్పథం, ఖగోళశాస్త్రం, జీవ పరిణామం, భూ విజ్ఞాన శాస్త్రం, మానసిక శాస్త్రంలో పలు అంశాలపై చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ పలు శాస్త్రాలపై రెండు రోజుల పాటు సెమినార్ తమ కళాశాలలో నిర్వహించడం ఆనందదాయకమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జగదీష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ టి. రామ్‌కుమార్, పైడి రజని, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల నిరసన అడ్డగింత



పూర్ణామార్కెట్ జంక్షన్ వద్ద రాస్తారోకో చేస్తున్న వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు



జన సైనికులను పంపించేస్తున్న పోలీసులు

జగదాంబ : వలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వలంటీర్లు తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డగించడంతో వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించారు. గురువారం సాయంత్రం జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ వద్ద వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లు, కార్యకర్తలు నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్, టూటౌన్, హార్బర్ స్టేషన్లకు సంబంధించి పోలీసులు పూర్ణామార్కెట్‌కు చేరుకున్నారు. అయినప్పటికీ వలంటీర్లు దిష్టిబొమ్మ దగ్ధం చేసేందుకు ప్రయత్నించడంతో వన్‌టౌన్ పోలీసులు దిష్టిబొమ్మను తీసుకెళ్లిపోయారు. దీంతో వార్డు అధ్యక్షుడు, వలంటీర్లు, కార్యకర్తలు కొద్దిసేపు పూర్ణామార్కెట్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. పోలీసుల చర్యలకు నిరసనగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తుతుందంటూ బైఠాయించిన వారిని అక్కడి నుంచి పంపించేశారు. ఈ కార్యక్రమంలో గండిబోయిన మూర్తి, కె. గంగాధర్, రవికుమార్, బత్తుల రాము, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

మరోమారు దాడికి సిద్ధంగా..

వలంటీర్లు శాంతియుతంగా నిరసన చేసేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో జనసేన సైనికులు అక్కడికి గుంపుగా చేరుకున్నారు. దిష్టిబొమ్మ దగ్ధం చేస్తే వెంటనే దాడికి పాల్పడడానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు జనసైనికులను దగ్గరుండి పంపించేశారు.

క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలి



క్రైస్తవులపై దాడులకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన

సీతమ్మధార : మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి జైలు రోడ్డు, డాబాగార్డెన్స్, జగదాంబ జంక్షన్, జడ్జి కోర్టు, సింగ్ హోటల్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ మణిపూర్‌లో రెండు నెలలుగా జరుగుతున్న మారణహోమంలో 122 మంది ప్రాణాలు కోల్పోయారని, 60 వేల మంది నిరాశ్రయులయ్యారని అన్నారు. ఎన్నో గ్రామాల ప్రజలు తమ ఊళ్లు విడిచి వెళ్లిపోయారని, ఇలాంటి పరిస్థితి మునుపెన్నడూ ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. ఈ మారణహోమాన్ని ఆపే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మణిపూర్‌లో క్రైస్తవుల చర్చిలు, హస్పిటల్స్, స్కూల్స్, ఆస్తులపై జరుగుతున్న ఉద్దేశపూరిత దాడులను అరికట్టాలని అన్నారు. ఇలా ఇక్కడ జరగడం వలన ప్రపంచ దేశాల్లో భారతదేశం చులకనవుతుందని అన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ విశాఖపట్నం అధ్యక్షుడు ఎంఏ అనిల్‌పాల్, పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక ఉత్సవం



స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కంచరపాలెం: ఆషాఢ మాస బహుళ ఏకాదశి సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామి ఆడికృత్తిక మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజుకృష్ణ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ స్వామికి క్షీర, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర నామ విభూది పుష్పాలతో అర్చనలు, సర్పదోష, కాలసర్ప, కుజ, రాహు, కేతు, దోష నివారణకు పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిపారు. సాయంత్రం దీపారాధన చేసి సుబ్రహ్మణ్య స్వామిని పల్లకిలో ఊరేగించారు.

సామాజిక భవనం ఆధునికీకరణ



ఆధునికీకరించిన సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 36వ వార్డు పరిధి గొడారిగోతుల్లో గల సామాజిక భవనాన్ని రూ.12 లక్షలతో ఆధునికీకరించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎలక్ట్రికల్ వర్క్స్, రెయిలింగ్, టైల్స్‌తో పాటు మొదటి అంతస్తు నిర్మించారు. ఆధునికీకరించిన సామాజిక భవనాన్ని వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు గురువారం ప్రారంభించి స్థానికులకు అందుబాటులోకి తెచ్చారు. కార్యక్రమంలో కుందేటి సుధాకర్, కుడితి రమణమ్మ, కాకి పద్మ, చెన్నా శ్రీధర్, ఈశ్వర్ కిషోర్, రమణి, జగన్‌మోహన్, కనకమహాలక్ష్మి, సోఫి, శ్రీనివాస్, నర్సింగ్, ఈశ్వర్, బాషా, ఉమ, వెంకట్రావు, రాజు, చిరంజీవి, కనకరాజు, దేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి



ఎకో వైజాగ్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో డాక్టర్ శశిప్రభ

కంచరపాలెం: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలను నియంత్రించాలని జిల్లా ఎన్జీవోస్ ఫోరం అధ్యక్షురాలు డాక్టర్ శశిప్రభ పిలుపునిచ్చారు. సీఫా ఎన్జీవో, ఎస్‌బీసీసీ సంస్థలు సంయుక్తంగా గురువారం కప్పరాడ జీవీఎంసీ హైస్కూల్‌లో పర్యావరణ పరిరక్షణ, రహదారి భద్రత, ఎకో వైజాగ్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పూర్తిస్థాయిలో కృషి చేయాలన్నారు. ఎకో వైజాగ్‌ను విజయవంతం చేయడానికి ప్రతి విద్యార్థి కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా జీవించాలని, ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని సూచించారు. మరో అతిథి కంచరపాలెం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఆదిరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు, అన్నదమ్ములకు ట్రాఫిక్ నిబంధనలను వివరించి అవి పాటించేలా చూడాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని ప్రతి రోజు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయమాలిని, సచివాలయ సిబ్బంది శ్రీలక్ష్మి, రమణి, తరంగిణి తదితరులు పాల్గొన్నారు.

నిర్విరామంగా శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ



శ్రీవిష్ణు సహస్రనామ పారాయణలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్ : పాతనగరం వన్‌టౌన్ రాజప్పనాయుడు వీధిలో గల శ్రీగీతా భవనంలో గీతా ప్రచార సమితి ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న కోటి శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ నిర్విరామంగా కొనసాగుతోంది. 9వ రోజు శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమాన్ని కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం వల్ల విశ్వం సుభిక్షంగా ఉంటుందన్నారు. సంస్థ అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 15న వేదసభతో కోటి శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సంస్థ గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, కార్యదర్శి ఎం. వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, జి. లక్ష్మీనరసింహ, మహిళా సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొమర్రాజు రచనలు స్ఫూర్తిదాయకం

ఆరిలోవ: తెలుగు భాషా సాహిత్యవేత్త కొమర్రాజు వెంకటలక్ష్మణరావు శత వర్ధంతి కార్యక్రమం గురువారం ఏయూలో తెలుగు విభాగంలో జరిగింది. ఈ సందర్భంగా కొమర్రాజు చిత్ర పటానికి అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కొమర్రాజు మనవడు, ఏయూ రాజనీతి శాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యుడు కొమర్రాజు రవి మాట్లాడుతూ భాష, సాహిత్యం తదితర వాటి చరిత్ర పరిశోధనలకు మాత్రమే కొమర్రాజు వెంకటలక్ష్మణరావు పరిమితం కాలేదన్నారు. ఆయన స్త్రీ విద్య కోసం కూడా పాటుపడ్డారని గుర్తు చేశారు. అప్పటి సమాజంలో స్త్రీలు అందరూ చదువుకోవాలని వెంకటలక్ష్మణరావు ఆకాంక్షించారన్నారు. దీంతో పాటు నిమ్న, బడుగు, అట్టడుగు వర్గాల ప్రజలు, వితంతువుల అభ్యున్నతి కోసం రచనలు చేశారన్నారు. బీవీకే కళాశాల తెలుగు విశ్రాంత ఆచార్యుడు దామెర వెంకట సూర్యారావు మాట్లాడుతూ కొమర్రాజు చిన్నప్పటి నుంచే సమాజం పోకడలను గుర్తించారన్నారు. విద్యార్థి దశ నుంచే సమాజాన్ని మేల్కొలిపే రచనలు చేశారని కొనియాడారు. ముసలి మొగుడు, పడుచు పెళ్లాం, తదితర కథలు రాసి సమాజాన్ని జాగృతిపరిచారన్నారు. కొమర్రాజు జీవితాన్ని నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏయూ తెలుగు శాఖాధిపతి జర్రా అప్పారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహాన్, తెలుగు ఆచార్యులు అన్నంశెట్టి ఈశ్వరమ్మ, బూసి వెంకటస్వామి, కె.రత్నశేఖర్, పి.లావణ్య, ఎ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వనితా వాకర్స్ సేవలు ఆదర్శం



క్లబ్ సభ్యురాలిని సత్కరిస్తున్న డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ తదితరులు

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ మహిళలు నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. మురళీనగర్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన క్లబ్ 21వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా ఆమె ప్రసంగించారు. సామాన్య సభ్యులుగా చేరిన ఎందరో మహిళలు వాకర్స్ ఇంటర్నేషనల్ స్థాయిలో నాయకులుగా ఎదిగిన విషయాన్ని గుర్తు చేశారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి వనితా వాకర్స్ క్లబ్ ఒక గొప్ప వేదికగా పేర్కొన్నారు. మహిళలు సమైక్యంగా ఉంటూ సమన్వయంతో పనిచేయడం వల్లే క్లబ్‌కు అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులు లభించాయని చెప్పారు. ఈ సందర్భంగా క్లబ్ మహిళలు ఉత్సవాలు ఆటపాటలతో సందడిగా నిర్వహించారు. పాడుతా తీయగా ఫేమ్ మావూరి శ్రావణి ఆలపించిన సినీ గీతాలు సభికులను అలరించాయి. డాక్‌యార్డ్ ఉద్యోగి శ్యాంబాబు మగ, ఆడ గొంతుకలతో పాడిన పాటలు మంత్రముగ్దులను చేశాయి. శిరీష లత, భానుమతి, సురేంద్రకౌర్‌లకు ఉప్పలపాటి శుభ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డులు అందించారు.

వినియోగదారుల సమస్యలపై న్యాయవిద్యార్థులకు అవగాహన

విశాఖలీగల్: వినియోగదారుల సమస్యల పట్ల న్యాయ విద్యార్థులకు అవగాహన అవసరమని విశాఖ జిల్లా వినియోగదారుల మండలి(2) అధ్యక్షురాలు గేదెల వెంకటేశ్వరి అన్నారు. గత నెల రోజులుగా ఆంధ్ర విశ్వ కళా పరిషత్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాల విద్యార్థుల శిక్షణ తరగతులు నేటితో ముగిశాయి. ఈ సందర్భంగా న్యాయమూర్తి వెంకటేశ్వరి మాట్లాడుతూ వినియోగదారుల చట్టం గురించి విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. న్యాయ కళాశాల చివరి సంవత్సరానికి చెందిన విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: ఏకాదశి సందర్భంగా శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణతులసీ దళార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి ఉభయ దాతలను స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన, పుణ్యాహవచనం పూజలు చేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు చక్రవర్తి ఈ సేవ నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం : శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి, విష్వక్సేన, పుణ్యాహవచనం పూజలు, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.